క్లుప్తంగా

ప్రతిభకు ప్రోత్సాహం



గౌతమిని సత్కరిస్తున్న జట్టు ఆశ్రమ సిబ్బంది

పార్వతీపురంటౌన్: పదో తరగతి పరీక్షల్లో 591 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన గౌతమిని జట్టు ఆశ్రమ ప్రతినిధులు ఆదివారం సత్కరించారు. ఆశ్రమ నిర్వాహకులు పద్మజ విద్యార్థినిని సత్కరించి ఆశ్రమం తరఫున నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జట్టు ఆశ్రమం సభ్యులు పాల్గొన్నారు.

రూ.9 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం



గ్రామంలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం

సాలూరు రూరల్: మండలం కొట్టుపరువు గ్రామంలో రూ.9 లక్షలతో తాగునీటి ట్యాంక్ నిర్మించారు. గతంలో ఉన్న వాటర్‌ట్యాంక్ శిథిలమవడంతో దానిస్థానంలో 20 వేల లీటర్ల సామర్థ్యంతో నూతన ట్యాంక్‌ను నిర్మించారు. దీని నుంచి పైపులైన్ల ద్వారా గ్రామంలోని ప్రతీ ఇంటికీ తాగునీరు సరఫరా చేసేందుకు కుళాయిలు ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శ్యామలాంబ పండగ విషయంలో అవాస్తవాలు నమ్మొద్దు



శ్యామలాంబ ఆలయ ధర్మకర్త విక్రమచంద్ర సన్యాసిరాజు

సాలూరు: భక్తుల కొంగు బంగారం, స్థానిక గ్రామదేవత శ్యామలాంబ పండుగ విషయంలో జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని ఆలయ ధర్మకర్త, సాలూరు జమీందార్ యువరాజ్ విక్రమ చంద్ర సన్యాసిరాజు కోరారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అమ్మవారి పండుగల నిర్వహణ విషయమై డిప్యూటీ సీఎం రాజన్నదొరతో మాట్లాడినట్లు చెప్పారు. పెద్దలంతా పండుగను ఎప్పుడు జరిపించాలని నిర్ణయిస్తే అప్పుడే చేద్దామని, పండగ నిర్వహణకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని రాజన్నదొర తెలిపారన్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన నిధుల మంజూరుతో పాటు శాంతిభద్రతలు, భక్తులకు వసతుల ఏర్పాటు పరంగా అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే పలు సంప్రదాయ బద్ధమైన విషయాల్లో అడ్డంకులు కలగడంతో పండగను వాయిదా వేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

సీతానగరం: రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. మండలంలోని చినంకలాం గ్రామంలో ఆదివారం రాత్రి ఓటరు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు వినియోగం, ఎన్నికల ప్రవర్తన నియమావళిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన, గ్రామాల్లో అల్లర్లు సృష్టించేందుకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. మే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

ఇంటింటికీ తాగునీరు సరఫరాకు చర్యలు



ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు

సీతానగరం: మండలంలోని గాదెలవలసలో జలజీవన్ మిషన్(జేజేఎం) ద్వారా చేపట్టిన ఇంటింటి కుళాయిల పనులు పూర్తికావడంతో ప్రజలకు తాగునీటి సమస్య తీరనుందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు అన్నారు. గాదెలవలసలో ఓవర్ హెడ్‌ట్యాంక్, అండర్ గ్రౌండ్ పైప్‌లైన్లను ఆదివారం ఏఈ ఆర్.పవన్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో గతంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నుంచి ఇంతవరకు అరకొరగా తాగునీరు సరఫరా అయ్యేదన్నారు. ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులు రూ.58 లక్షలతో గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ట్రైలరన్ పూర్తిచేసి పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు.

పల్లెల్లో ప్రగతి బాటలు

- కోట్లాది రూపాయలతో గ్రామీణ రహదారుల అభివృద్ధి
- రాకపోకలు సులభతరం

సీతానగరం: గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ ఉన్న మట్టిరోడ్లు, గ్రావెల్ రోడ్లు బీటీరోడ్లుగా మారిపోయాయి. టీడీపీ ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధిని గాలికొదిలేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతంగా తీర్చిదిద్దింది. గతంలో రాళ్లు, గుంతలతో నిండిన గ్రామీణ రహదారులు నేడు జాతీయ రహదారులను తలపిస్తున్నాయి. పంచాయతీరాజ్ ప్రాజెక్టు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో రాష్ట్ర రహదారులను ఆనుకుని ఉన్న కనెక్టింగ్ రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. రోడ్ల స్థితి మెరుగుపడటంతో సాఫీగా రాకపోకలు సాగిస్తున్నామని వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- మండలంలోని గుచ్చిమి–టి.సీతారాంపురం మధ్య రూ.95 లక్షలతో బీటీరోడ్డు నిర్మించారు.



చినంకలాం గ్రామానికి వేసిన బీటీరోడ్డు

- ఆర్.వెంకంపేట నుంచి కాశీపేట జంక్షన్ వరకు శిథిలమైన బీటీరోడ్డుకు రూ.1.25 లక్షలతో మరమ్మతులు చేపట్టారు.
- రూ.1.35 కోట్లతో అంటిపేట జంక్షన్ నుంచి రెడ్డివానివలస, రామవరం మీదుగా ఆర్.వెంకంపేట వరకు బీటీరోడ్డు నిర్మించారు.



చినంకలాం జంక్షన్ నుంచి శివరాంపురం గ్రామానికి వేసిన బీటీరోడ్డు



కృష్ణారాయపురం గ్రామానికి నిర్మించిన బీటీరోడ్డు

- అలాగే నిడగల్లు నుంచి విశ్వంభరపురం మీదుగా జనహిత విద్యాలయం వరకు రూ.90 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం.
- పణుకుపేట జంక్షన్ నుంచి కె.ఎస్.పురం మీదుగా దయానిధిపురం వరకు రూ.1.28 కోట్లతో బీటీరోడ్డు.
- బొబ్బిలి మండలం కోమటిపల్లి జంక్షన్ నుంచి రూ.89 లక్షలతో బీటీరోడ్డు.
- రూ.1.25 కోట్లతో లక్ష్మీపురం నుంచి వెంకటాపురం వరకు బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు.
- సీతానగరం మండలం గాదెలవలస మీదుగా పణుకువలస బీటీరోడ్డును అనుసంధానిస్తూ బలిజిపేట మండలం శివరాంపురం వరకు ఉన్న 620 మీటర్లు గ్రావెల్ రోడ్డును రూ.65 లక్షలతో బీటీరోడ్డుగా మార్చారు.
- బలిజిపేట మండలం పణుకువలస జంక్షన్ నుంచి సీతానగరం మండలం చినంకలాం గ్రామానికి సుమారు 1.2 కిలోమీటర్ల మేర ఉన్న మెటల్ రోడ్డును రూ.1.07 కోట్లతో బీటీరోడ్డుగా అభివృద్ధి చేశారు.

రహదారి సమస్య తీరింది



మా గ్రామానికి వెళ్లే రోడ్డు బాగులేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక రామవరం, ఆర్.వెంకంపేట వరకు బీటీరోడ్డు నిర్మించడంతో రహదారి సమస్యకు పరిష్కారం లభించింది.

– ఎ.కృష్ణంనాయుడు, అంటిపేట

రహదారి బాగుపడింది



గతంలో వచ్చిన హుద్‌హుద్, తిత్లీ, లైలా తుఫాన్లకు మా గ్రామ రహదారి పూర్తిగా ఛిద్రమైంది. గత టీడీపీ ప్రభుత్వం రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంతో రాకపోకలకు అవస్థలు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక కోట్లాది రూపాయలతో బీటీరోడ్లు నిర్మించారు మా గ్రామానికి మూడు వైపులా ఉన్న రోడ్లను బాగుచేశారు. దీంతో రోడ్డు సమస్య పరిష్కారం లభించింది.

– బొన్నాడ తిరుపతిరావు, గాదెలవలస

బంధువులు రావడానికి ఇబ్బందులు పడేవారు



గతంలో మా గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో మా ఊరు వచ్చేందుకు బంధువులు, స్నేహితులు వచ్చేందుకు ఇబ్బందులు పడేవారు. మేం దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న రహదారి సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే జోగారావు పరిష్కరించారు. బస్టాండ్ నుంచి ఊర్లోకి వచ్చేవరకు బీటీరోడ్డు వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి.

– ఈదుబిల్లి నాగేశ్వరరావు, కృష్ణారాయపురం

చెప్పారంటే.. చేస్తారంతే

జగన్ మాటిస్తే తప్పక నెరవేర్చుతారు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు పాదయాత్ర చేపట్టిన సమయంలో రైతుల కష్టాలను దగ్గరగా చూసి, రైతులను ఆదుకునేందుకు రైతుభరోసా పథకం కింద రూ.13,500 అందిస్తానని మాట ఇచ్చారు. ముఖ్యమంత్రి అయిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు పథకం ద్వారా అర్హులైన ప్రతీ రైతుకు ఏడాదికి రూ.13,500లు చొప్పున అందించారు. ఈ ఎన్నికల మేనిఫెస్టోలో రైతుభరోసా నిధులను రూ.16,000లకు పెంచారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలపై రైతులకు నమ్మకం ఉంది.

– చొంగలి వెంకటమ్మ, మేళాపువలస గ్రామం, మక్కువ మండలం

కచ్చితంగా అమలు చేస్తారు



నా భర్త మృతి చెందడంతో నాకు వితంతు పింఛన్ అందుతోంది. గత ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్మును పెంచుతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3 వేలుకు పెంచారు. ఈ సారి మేనిఫెస్టోలో రెండు విడతల్లో పింఛన్‌ను రూ.3500లు చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ హామీ ఇచ్చారంటే కచ్చితంగా నెరవేరుస్తారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఆయన్ను మరోసారి సీఎంను చేసుకుంటాం.

– తంగుడు చిన్నమ్మి, బంగారువలస గ్రామం, మక్కువ మండలం

సుస్థిర పాలనకు మద్దతివ్వండి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరం: ఎమ్మెల్యే జోగారావుకు విజయతిలకం దిద్దుతున్న మహిళ

సీతానగరం: రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి, సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఓటర్లను కోరారు. మండలంలోని ఇప్పలవలసలో సర్పంచ్ సీహెచ్ లక్ష్మణరావు, ఎంపీటీసీ జి.సంతోషికుమారి, మాజీ సర్పంచ్ యు.గౌరునాయుడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులు గజమాలతో ఆయనకు స్వాగతం పలకగా.. మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు.

ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని వివరించారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజారాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, నాయకులు బి.శ్రీరాములునాయుడు, కొయ్యాన శ్రీవాణి, బి.తిరుపతిరావు, ఎం.ధనంజయనాయుడు, బి.శంకరరావు, మన్మథరావు, వై.వెంకటరమణ, రెడ్డి మురళీ, శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక యువతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



బలిజిపేట: పి.రావివలసలో ఇంటింటా ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు

పి.రావివలసలో ఇంటింటా ప్రచారం

బలిజిపేట: రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి రాష్ట్రంలో సంక్షేమ పాలనకు మద్దతు పలకాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ కోరారు. మండలంలోని పి.రావివలసలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే జోగారావు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. గ్రామాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి జరగాలన్నా.. మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ జయప్రకాష్, ఎంపీటీసీ ఎం.సాంభమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, దాసరి కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమాదేవి, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డి.శంకరరావు, ఎస్.సుధాకర్, వి.సత్యనారాయణ, వినోద్, మాకినాయుడు, పకీరునాయుడు, జి.సత్యంనాయుడు, ఎం.శ్రీనివాసరావు, కె.వెంకటరమణ, ఎ.పోలినాయుడు పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణంలో..



పార్వతీపురంటౌన్: పట్టణంలోని 6వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో సంక్షేమం, సుస్థిరాభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని 6వ వార్డులో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీ కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని కోరారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ ప్రభుత్వంలో మీకు మేలు జరిగిందని భావిస్తే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ సభ్యులు కొయ్యాన శ్రీవాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక వార్డు కౌన్సిలర్ మజ్జి పారినాయుడు, వార్డు కన్వీనర్ నేరేడుబల్లి సదానందం, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారంలో పీడిక రాజన్నదొర

- ప్రజలకు మంచి చేయడమే సీఎం జగన్ అంజెండా
- ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం, సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర కోరారు. పట్టణంలోని 1వ వార్డు కోటవీధి, ఒడియా పండావీధిలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్నదొరకు స్థానికులు పూలమాలలు వేసి, హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయడమే జగనన్న అజెండా అని అన్నారు. ఐదేళ్ల పాలనలో పార్టీలకు అతీతంగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని, కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్‌రెడ్డి కాగా, మోసం చేసింది చంద్రబాబు అని విమర్శించారు. ఎన్నికల వేళ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బూటకపు హామీలతో చంద్రబాబు వస్తున్నారని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మీకు మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజారాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరి రఘు, రౌతు అప్పారావు, గొర్లె వెంకటరావు, రాపాక మాధవరావు, కిలారి రవి, తదితరులు పాల్గొన్నారు.



కోటవీధిలో రాజన్నదొరకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతూ కరపత్రం అందజేస్తున్న రాజన్నదొర

పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం:

జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌వీ నివాస ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు అధ్యక్షతన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వివిధ స్థాయి కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో 58 నెలల పాటు చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, అందులో పేర్కొన్న హామీలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.జయమణి, జెడ్పీ మాజీ చైర్మన్ వి.నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యులు కొయ్యాన శ్రీవాణి, జెడ్పీటీసీ సభ్యులు ఎం.బాబ్జీ, పార్టీ మండల సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు, ఎస్.రామకృష్ణ, మాజీ ఎంపీపీ కె.రత్నాకర్, డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణంనాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, మండల జేసీఎస్ కన్వీనర్ యు.సురేష్‌కుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

సాలూరు: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు డా.ప్రమోద్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ, డబ్బివీధిలలో ఉన్న 36, 37, 48, 51, 52 పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులు, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపును పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

రాజన్నదొరకు మద్దతుగా..



మక్కువ: కన్నంపేటలో ప్రచారానికి వెళ్లిన మావుడి సోదరులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



పాచిపెంట: పిండ్రంగివలసలో ప్రచారం చేస్తున్న వీరంనాయుడు

పాచిపెంట: వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు మద్దతుగా పార్టీ మండల ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు మండలంలోని పిండ్రంగివలస గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి రాజన్నదొర చేసిన కృషిని వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా రాజన్నదొరను, ఎంపీగా తనూజారాణిని భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బడ్నాన వీరయ్య, నాయకులు బీటీ ప్రసాద్, సూర్యనారాయణ, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కన్నంపేటలో మావుడి సోదరుల ప్రచారం

మక్కువ: మండలంలోని కన్నంపేట గ్రామంలో జెడ్పీటీసీ, బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా పీడిక రాజన్నదొరను, ఎంపీగా తనూజారాణిని గెలిపించాలని కోరారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమీ చేయకుండా ఎన్నికలు సమీపించడంతో ఇప్పుడు అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు, కూటమి నాయకులు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయుకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.